పెళ్ళికి ముందు కూడా కమల ఉద్యోగం చేస్తుండేది. అత్తవారింట్లో అడుగుపెట్టగానే ఉద్యోగం మానేద్దామని అనుకుంది. కానీ సంసారభారం అంతగా లేకపోవటంతో స్కూలుకి వెళుతూనే వుంది. ఇద్దరాడబిడ్డలు, బావగారు, తోడికోడలు, అత్తమామలతో ఇల్లు కళకళలాడుతుండేది. ఇంటి పని భారం అంతా సమానంగా పంచుకునేవారు. కమల భర్త మూర్తికి ఒక ప్రయివేటు కంపెనీలో పని. సాయంత్రం ఇల్లు చేరుకునేందుకు ఒక నిర్దిష్ట సమయం వుండేది కాదు. ఒకోసారి భర్త ఆలస్యంగా ఇంటికి వచ్చినా కమల పట్టించుకునేది కాదు. నలుగురున్న ఇంట్లో సందడిగా కాలం గడచిపోయేది. పెళ్ళయిన వెంటనే పిల్లల బాధ్యత తరుముకురాలేదు కమలని. శాంతంగా ఎటువంటి సమస్యలు తల ఎత్తకుండా స్కూలుకి వెళ్ళి వస్తూనే వుంది. సంవత్సరం, రెండు సంవత్సరాలు యిలా మూడేళ్ళు గడిచాయి. ఈ కాలంలో కమల అత్తగారు తోడురాగా డాక్టరుని చూసింది. తల్లి కాలేదన్న ఆందోళన, భయం లోలోపల బాధించ సాగాయి. అత్తింట్లో, ఇరుగుపొరుగు ఆ విషయం బాహాటంగా చర్చించసాగారు. మందులు, టానిక్కులు, పరీక్షలు ఈ తతంగం మూర్తిని అంతగా బాధించలేదు. తన పనిలో తను నిమగ్నుడయి కులాసాగా కొంత నిర్లక్ష్యంగా గడపసాగాడు. ఈ సత్యం కమల గ్రహించేనాటికి చాలా సమయం మించిపోయింది.

ఒక రోజు కమల పుట్టింటికి వెళితే తల్లి, అక్క దగ్గిర కూర్చోబెట్టుకుని ఎన్నో వ్యక్తిగత విషయాలు తరచి తరచి అడిగారు. హెచ్చరికలు చేశారు. కమల పెదవి బిగించి తల విదిలించింది. ససేమిరా వారితో అంగీకరించలేదు. కళ్ళల్లో నీళ్ళు తిరుగుతున్నా వాదించి, నొచ్చుకుని, అభిమానంతో ఇల్లు చేరుకుంది.




కానీ ఆ రాత్రి కమల నిశ్చింతగా పడుకోలేదు. రాత్రి భర్త పొద్దుపోయాక ఇంటికి రావటం గమనించింది. మర్నాటినుంచీ అతని వైఖరి, రాకపోకలు నిశితంగా కనిపెట్టింది. మనసు అంగీకరించని సత్యాన్ని ఒక రోజు కళ్ళతో చూసింది. బస్సుకోసరం వేచివున్న కమల ముందుగా దూసుకుపోయింది ఆటోరిక్షా. రెపరెపలాడుతున్న నీలంరంగు సిల్కుచీర, మెడపైకి పెద్ద ముడి, చేతిలో పర్సు, ఒంటిమీద నాజూకుగా నగలు, చామనచాయ అయినా తీరైన కనుముక్కుతీరు మూర్తి భుజంమీద కిలకిలా నవ్వుతూ ఒరుగుతున్న ఆమెని చూసింది.

పేరు నీలిమ. బెంగాలీ. అతని ఆఫీసులో అసిస్టెంటు. ఒకే సెక్షనులో పని. మూడేళ్ళ పరిచయం గాఢస్నేహంగా మారి వారిని సన్నిహితం చేసింది. ఆఫీసుకి దగ్గిరగా ఆమె ఇల్లు తీసుకుంది. సినిమాలకి, బజారుకి, షైవూళ్ళకి కలిసి వెళ్ళేవారు. ఆప్తులు, బంధువులు వారిద్దరి క్షేమం కోరేవారు వారించి చూశారు. భయపెట్టారు. కానీ ఒక నిశ్చిత ధైర్యం వారిని చాలా దూరం తీసుకుపోయింది.

కమల అత్తింట్లో రభస జరిగింది. పరస్పరం తగూలు, ఏడుపులు, ఉపవాసాలు ఎన్నో అయ్యాయి. కానీ అతను నోరు మెదపలేదు. భార్యని ఓ కొత్త వ్యక్తిని చూసినట్లు పరధ్యానంగా చూశాడు. తన ప్రవర్తన మార్చుకోలేదు. వారికి సంతానం లేకపోవటంవల్లనో ఏమో కొన్నాళ్ళకి యింట్లో దుమారం అణిగింది. స్తబ్దత చోటుచేసుకుంది.

*

పెళ్ళయిన ఏడేళ్ళకి కమల యింకా స్కూలుకి వెళుతూనేవుంది. కానీ నివాసం మార్చుకుంది. ఇప్పుడామె విడిగా రెండు గదులు అద్దెకి తీసుకుని వుంటోంది. అతి సాధారణమైన చీరలు, చేతికి మట్టిగాజులు, నుదుటిమీద ఎర్రని కుంకుమబొట్టు. కమల చిక్కింది. నవ్వితే కళ్ళకింద నీలం చారలు ప్రస్ఫుటంగా కనబడుతున్నాయి. జడ మానేసి చిన్న ముడి చుట్టుకుంటోంది. స్కూలునుంచి వచ్చాక ఇరుగుపొరుగుతో కాలం గడుపుతుంది. అప్పుడప్పుడు పుట్టింటికి వెళ్ళేది. అత్తింటికి వెళ్ళి అందరినీ ఆదరంగా పలకరించేది. భర్త ఎదురైతే గౌరవంతో పక్కకి తప్పుకునేది.

జీవితం మీద ఎంతో నమ్మకం కమలకి. పండగలన్నీ విడవకుండా చేసేది – ముఖ్యంగా వరలక్ష్మీ వ్రతం. అత్తమామలు యిచ్చే కానుకల్ని ఉత్సాహంగా అందుకునేది. 'మా అత్తగారు, ఆడబిడ్డ' అంటూ వారిని గురించి గర్వంగా చెప్పుకునేది. భర్త ఒక బిడ్డ తండ్రి అయినా తనవాడేననీ, ఏనాటికయినా తన దగ్గరకే వస్తాడనీ దృఢంగా నమ్మేది. అందుకనే కోర్టులు, సాక్షులు అనే చికాకులు పెట్టుకోకుండా తన సంపాదనలో స్వతంత్రంగా, శాంతంగా బ్రతకసాగింది. తన జీవితానికి అడ్డుగోడ అయి భర్తని వేరుచేసిన నీలిమ మీద అక్కసు పెంచుకోలేదు. ఆమె గురించి చాలా సామాన్యంగా, ఉద్రేకరహితంగా మాట్లాడేది. ఆమెకి కావలసింది తన ఇల్లు. భర్త. న్యాయం తన పక్షం వుంది. అత్తమామలు తనని గౌరవిస్తున్నారు. లోకం సానుభూతితో చూస్తోంది. తప్పుచేసింది తన భర్త. అతను పశ్చాత్తాపంతో తిరిగివస్తే చేతులు చాచే మనసు తనకుంది. ఇది ఎలాగూ జరిగితీరుతుంది. ఇలా జరిగిన సందర్భాలు ఎన్ని లేవు? అదే ఆమె ఆశావాదం. ఆ ఆశతోనే జీవిస్తోంది.

ఒక రోజు మాలతికి బజారులో కనపడింది కమల. పెరుగుతున్న ధరల్ని గురించి గట్టిగా చర్చిస్తున్న కమల చటుక్కున నాలిక కరచుకుని కళ్ళు కిందికి వాల్చింది. 'ఏమయింది? ఎవరు?' అని అడుగుతూ చుట్టూ చూసింది మాలతి.

"బావగారు....అదిగో ఆ కొట్లో" అంది తగ్గుస్వరంతో కమల. ఆయన సైకిలు ఎక్కి వెళ్ళేంతవరకూ అలాగే నిలబడివుంది. మాలతికి కొద్దిగా చిరాకు కలిగింది.

"మూర్తి విషయం ఏమన్నా తెలిసిందా?" అడిగింది—ఆమెని వాస్తవిక ప్రపంచంలోకి లాగుతూ.

"ఆ బాగున్నారు. నా గురించి తరుచు అడుగుతారట" కమల కళ్ళు మిలమిలలాడాయి.

"నిన్ను వచ్చి చూస్తారా?" అడక్కుండా వుండలేకపోయింది మాలతి.

"ఊహు....ఆయనకి మొహమాటం. చిన్నబుచ్చుకుంటారు" అంటూ ముందుకి నడిచింది. కమల ఇప్పుడు పూర్తి తెల్లచీర కట్టుకుంటోంది. గాజులు, దండ తీసేసింది. జుత్తు పలచబడి చెంపల దగ్గిర నెరిసింది. మునుపటిలా తలలో పూలులేవు. నుదుట కుంకుమ పరిమాణం చిన్నదయింది.

*

మాలతి భర్తకి బదిలీ అయి హైదరాబాదు వెళ్ళిపోయింది. అయిదేళ్ళ కాలంలో కమల తాలూకు స్మృతులు తగ్గుతూ వచ్చాయి. మధ్యలో ఢిల్లీ వెళ్ళినా కమల గురించి ఎక్కువ సమాచారం సేకరించలేకపోయింది. "ఆ కనపడుతూనే వుంటుంది. అక్కడే వుంటోంది. స్కూల్లో పనిచేస్తోంది" అంది అత్తగారు ఒకరోజు. అంతే. అంతకుమించి మళ్ళీ ఢిల్లీ వెళ్ళేవరకూ మాలతి ఏమీ ఆరా తీయలేదు.

కానీ ఆమె తెలుసుకోవలసిన విషయాలు చాలా మిగిలిపోయాయి. అవి ప్రత్యక్షంగా తెలుసుకునే అవకాశం కూడా ఒక రోజు కలిగింది. కమలకి జీవితం మీద వున్న నమ్మకం ఆమెని చాలా దూరం తీసుకుపోయింది. ముక్తిని కలుగజేసింది.


ఆ రోజు కరోల్‌బాగ్‌లో ఆడబిడ్డతో వెళుతున్న మాలతికి ఓ యిల్లు చిరపరిచితంగా కనపడింది. ఇంటి ముందు గుంపుగా జనం వున్నారు. ఆ జనంలో కొన్ని ముఖాలు తెలిసినవి. మాలతి గేటు దగ్గిర ఆగటం, లోపల స్త్రీలు గట్టిగా ఏడవటం ఒకేసారి జరిగాయి. కమల నిర్జీవ శరీరాన్ని ఆసుపత్రినుంచి తిన్నగా అత్తవారింటికే తీసుకు వచ్చారు. ఆమె చుట్టూవున్న స్త్రీలలో కమల ఇంటావిడ కూడా వుంది. భర్త మూర్తి శాస్త్రోక్తంగా అంత్యక్రియలు జరిపేందుకు సన్నాహాలు చేస్తున్నాడు. జీవాన్ని ఆఖరుసారి ఎలా పంపాలో సలహాలిచ్చే పెద్దలు, పండితులు హడావుడిగా వున్నారు. కమల పుట్టింటివారు కామోసు విడిగా ఓ మూలగా కూర్చుని వున్నారు.

కమల నేలమీద ప్రశాంతంగా పడుకునివుంది. ఆమె పార్థివ శరీరాన్ని అందంగా రంగుచీరలో అలంకరించారు. ఏనాడో ఆమె వదిలేసిన అలంకారాలు ఈనాడు ఆమెని వరించాయి. తనవాళ్ళే అని గాఢంగా నమ్మిన అత్తమామలు దగ్గిర కూర్చుని వున్నారు. తన ఇంట్లోనే ఆమె పడుకుని వుంది. తను నిత్యం గౌరవించి నమ్మిన భర్త కూడా వుండి ఆఖరి ప్రయాణం చేయిస్తున్నాడు. ఆ ప్రాణి జీవించివున్నప్పుడు కోరుకున్నవి ఆలస్యంగా అయితేనేం....ఇప్పుడు లభించాయి. ఇంటి కోడలైన ఆమెకి వీడ్కోలు యిచ్చేందుకు బంధువులు, స్నేహితులు, ఇరుగుపొరుగు చాలామంది జనం గుమికూడారు. అన్ని తతంగాలు శాస్త్రోక్తంగా జరుగుతున్నాయి. 'పుణ్యాత్మురాలు' అంటూ కొందరు వితంతువులు ఆమెకి నమస్కరిస్తున్నారు.

"ఆసుపత్రికి వచ్చి చూసిన పాపాన్నయినా పోలేదు. ఇప్పుడు చూడు ఎలా చేస్తున్నాడో!" అంటూ మూర్తిని దూషిస్తున్న ఇంటావిడను వారించింది మాలతి. "ఉష్ ఊరుకోండి... మీ మాటలు విని కమల ఆత్మ క్షోభిస్తుంది". స్నేహితురాలి దగ్గిర ఆఖరుసారి శలవు తీసుకుని బైటికి నడుస్తూ యిలా అనుకుంది మాలతి.

"కమల వేదాంతం వేరు. ఆశలు, విలువలు వేరు. జీవితాన్ని ఎంతో ఆశతో ప్రతీక్షతో అధిగమిస్తూ చివరికి ముక్తి పొందిన ప్రాణి. ఒంటరిగా వున్నా నలుగురికీ తన కొత్త వేదాంతం పంచి యిచ్చింది. నలుగురిలో మంచినే చూసింది. మంచినే ఆశించింది. వాస్తవిక జీవితంలోని కఠిన సత్యాలు తనలాటి సామాన్యులకి. కమల ఏనాడో వాటినుంచి దూరమయింది. మానసికంగా పై అడుగు వేసింది. అజ్ఞానంవల్ల, బలహీనతవల్ల కాదు. స్వశక్తితో వాటిని జయించగలిగింది. చివరికి ముక్తి పొందింది."

కమలలాంటి స్త్రీలు యింకా వున్నారనీ, వుంటారనీ జ్ఞాపకం చేస్తూ భోరున ఏడుపులు వినపడుతున్నాయి వెనకగా. మాలతి మౌనంగా గేటు బైటికి నడిచింది. **



**ఆశ**

వేదనలు జీవితాన్ని
నిర్జీవంగా మార్చేసినా
కన్నీటి కెరటాలు
ఉప్పెనలా ఎగసినా
గుండెలో గ్రీష్మం గూడుకట్టినా
మోడు వారిన జీవితంలోకి
వసంతం వస్తుందని
బ్రతుకు వెన్నెలమయం అవుతుందని
ఆశ!
బ్రతుకును బ్రతికించేది
ఇదే కదూ?

—చెళ్ళపిళ్ళ పద్మజామూర్తి

## విద్యారంగంలో వనితలు:



**సుజనారెడ్డి**

కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ ఆఫ్ ఇండియావారి అధ్వర్యంలో ఇండియన్ ఆడిట్ అండ్ అక్కౌంట్స్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన బెనవలెంట్ ఫండ్ పథకం కింద యేటా జాతీయ స్థాయిలో విద్యారంగంలో విశిష్టస్థానాన్ని అందుకున్నవారికి స్కాలర్‌షిప్స్ యిచ్చి ప్రోత్సహిస్తుంటారు. ఈ సంవత్సరం ఆ విద్యార్థి వేతనాన్ని పొందిన ఆరుగురు స్టూడెంట్స్‌లో తెలుగు విద్యార్థిని కుమారి సుజనారెడ్డి కూడా ఒకరు కావటం ఓ విశేషం. ఆమె తండ్రి శ్రీ బి. వి. రెడ్డి-రక్షణశాఖ ఆడిట్ విభాగం (ఆవడి-మద్రాసు)లో సీనియర్ ఆడిటరు. 17 సంవత్సరాల సుజనారెడ్డి ప్రస్తుతం-కిల్పాక్ మెడికల్ కళాశాలలో ఎమ్. బి., బి. ఎస్. చదువుతోంది.

"ప్రాచీనకాలంలో వైద్యచికిత్స విషయంలో మన దేశానికే మంచిపేరు వుంది. ఆ పేరు ప్రతిష్ఠలు మనం నిలుపుకోవాలంటే, ఇప్పుడు విదేశాలలో లభించగలవనుకునే వైద్య సదుపాయాలన్నీ మన దేశంలోనే లభ్యం కావాలి. 'మానవ సేవే మాధవసేవ' అనడానికి ఎంతగానో దోహదం చేసే ఈ వైద్య విజ్ఞానార్జనలో విశేషమైన కృషి చేసి, డాక్టరుగా అందరి మెప్పు పొందడమే నా ఆశయం, ధ్యేయం" అంటారు కుమారి సుజనారెడ్డి.